క్లుప్తంగా

ఘనంగా నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ర్యాలీ గిరిజన గ్రామంలో ఆదివారం నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆలయ అభివృద్ధికి గాను రూ.20వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

గుడి నిర్మాణానికి విరాళం



గ్రామపెద్దలతో మాజీ ఎమ్మెల్సీ

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట గ్రామంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ గుడి నిర్మాణం కోసం రూ.51వేల విరాళాన్ని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ కోటపల్లిలోని స్వగృహంలో గ్రామ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పసునూటి వసంత కుమారి, బంజారాలు దేశ్యానాయక్, రాములు, సంతోశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె



సమ్మెలో పాల్గొన్న గ్రామ పంచాయతీ సిబ్బంది

జన్నారం: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లు, పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెను ఆదివారం అధికార పార్టీ నాయకులు సందర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచి, జీవో నంబర్ 51 సవరించాలని సిబ్బంది డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది యూనియన్ అధ్యక్షుడు రాజమల్లు, సభ్యులు, శ్రీనివాస్, వెంకటేశ్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్‌పై కాంగ్రెస్ స్పందించాలి'

జన్నారం: స్వాతంత్య్రం వచ్చి 75సంవత్సరాలు పూర్తయినా జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని, ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ స్పందించి బీసీ రిజర్వేషన్లపై మాట్లాడాలని బీసీ కులాల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ చంద్రయ్య, కో ఆర్డినేటర్ నర్సయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం సమావేశంలో మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఒత్తిడి పెంచి, బీసీ కులాలతో కలిసి బీసీ రిజర్వేషన్లకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో బీసీ కులాల పోరాట సమితి నాయకులు భాస్కర్‌గౌడ్, లక్ష్మణ్, లక్ష్మీనారాయణ, విజయ్, తిరుపతి తదితరులున్నారు.

సాక్షి సినిమాలు



మంచిర్యాల

శ్రీనివాస : రామబాణం
వెంకటేశ్వర : పీఎస్-2
జెమిని సినిమా స్క్రీన్ 1 : ఉగ్రం/ ది కేరళ స్టోరీ
జెమిని సినిమా స్క్రీన్ 2 : రామబాణం/ గార్డియన్స్ ఆఫ్ ది గ్యాలక్సీ/విరూపాక్ష

లక్సెట్టిపేట

మహానంద : రామబాణం

జన్నారం

రాఘవేంద్ర : రామబాణం

చెన్నూర్

శ్రీశ్రీనివాస : రామబాణం

బెల్లంపల్లి

రామకృష్ణ : రామబాణం
బాలాజీ : విరూపాక్ష

- మంచిర్యాలటౌన్

జీతాల పెంపుతో జీపీలపై భారం

- మల్టీపర్పస్ సిబ్బందికి రూ.వెయ్యి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు
- పెంచిన వేతనభారం పంచాయతీలపైనే
- ప్రత్యేక గ్రాంట్ ఇవ్వకపోవడంతో అసంతృప్తి



గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

కోటపల్లి: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్‌కు ప్రతి నెలా రూ.వెయ్యి పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. గ్రామ పంచాయతీ కారోబార్లు, కార్మికుల వేతనాలు పెంచాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మిక సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి గత నెలలో వినతిపత్రాలను అందించాయి. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఈ నెల 5వ తేదీ నుంచి సమ్మె చేపడుతామని నోటీసులు ఇచ్చాయి. పంచాయతీ కార్మికుల ఆందోళన నేపథ్యంలో వేతనం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు పంచాయతీ సిబ్బందికి నెలకు రూ.8500 వేతనం చెల్లిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఇక నుంచి రూ.9500 చెల్లించనున్నారు. పెంచిన వేతనాన్ని చెల్లించే బాధ్యత పంచాయతీలపైనే ప్రభుత్వం భారం మోపింది. ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ ఇవ్వకపోవడంతో సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది. పంచాయతీల ఆదాయం అంతంత మాత్రంగానే ఉండగా పెంచిన వేతన భారం ప్రభుత్వం తీసుకోకపోవడంపై నిరసన వ్యక్తమవుతోంది. పంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, ఎలక్ట్రీషియన్, డ్రైవర్లు, పంప్ ఆపరేటర్లు, పారిశుధ్య కార్మికులు అందరిని మల్టీపర్పస్ కార్మికులుగానే ప్రభుత్వం గుర్తించింది.

జీపీలకు ప్రతినెలా....

మంచిర్యాల జిల్లాలో 16 మండలాలు ఉండగా 310 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 1098 కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. ఆర్థిక సంఘం నిధుల నుంచి గతంలో జీతాల కోసం వినియోగించేవారు. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం మార్గదర్శకాలను మార్చడంతో వేతనాల కోసం జీపీలు పన్నుల ఆదాయం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులను వినియోగించేవి. ట్రెజరీ కార్యాలయాల ద్వారా వేతనాలను చెల్లించడానికి చెక్కులు పంపిస్తుండడం ఫ్రీజింగ్ కారణంగా చెక్కులు సకాలంలో చెల్లకపోవడంతో వేతనాలు చేతికందడంలో జాప్యం నెలకొంది. పంచాయతీల కార్మికుల వేతనాల భారంను ప్రభుత్వం మోస్తేనే పంచాయతీలకు ఇబ్బంది తప్పుతుందనే వాదన వినిపిస్తుంది. అంతేకాకుండా ప్రభుత్వం నిధుల నుంచి వేతనాల చెల్లిస్తే ప్రతీనెల సకాలంలో తమ ఖాతాల్లో జీతాలు జమఅవుతాయని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. పంచాయతీ కార్మికుల వేతనాలను ప్రభుత్వం పెంచినా క్షేత్ర స్థాయిలో మాత్రం సంతృప్తి లేకపోవడం గమనించదగ్గ విషయమని చెప్పొచ్చు.

'ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి'



మాట్లాడుతున్న ఏమాజీ

బెల్లంపల్లి: ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి పలు సందర్భాల్లో బెల్లంపల్లి అభివృద్ధి కోసం హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. మరోసారి బెల్లంపల్లికి రానుండటంతో మంత్రి పర్యటనపై పుర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ ఉన్నా నెరవేరడం లేదన్నారు. సంక్షేమ శాఖ తరఫున బాలుర డిగ్రీ కళాశాలను మంజూరు చేయాలని, మున్సిపాలిటీలో ఉన్న కొన్ని ప్రాంతాల వారికి మాత్రమే ఇళ్లపట్టాలు జారీ చేయడం సరికాదన్నారు. పురప్రజలకు అందరికీ ఇళ్లపట్టాలు ఇచ్చి యాజమాన్య హక్కు కల్పించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బెల్లంపల్లిలో ఆర్టీసీ బస్ డిపోను మంజూరు చేయాలని, గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యాలను మెరుగుపర్చాలని పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో 100పడకల సామర్థ్యానికి సరిపడా మందులు, వైద్యులు సిబ్బందిని నియమించి రోగుల ఇబ్బందులు తీర్చాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కేశవ రెడ్డి, రాజులాల్ యాదవ్, కోయిల్‌కార్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

తాపీమేస్త్రీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు సుధాకర్

భీమారం: నిర్మాణరంగంలో కీలకంగా ఉన్న తాపీమేస్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని మండల తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు బాసాని సుధాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవననిర్మాణ రంగంలో పనిచేసే మేస్త్రీలకు ఎలాంటి భద్రతలేదని, పనిచేయనిదే కుటుంబం గడవదన్నారు. ముఖ్యంగా అన్నిరంగాల వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం తాపీమేస్త్రీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇన్సూరెన్స్ అందించాలని, 60సంవత్సరాలు దాటిన వారికి నెలకు రూ.6వేల పెన్షన్ అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రతి మేస్త్రీ తమపేర్లను కార్మికశాఖలో నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడిగా బాసాని సుధాకర్, ఉపాధ్యక్షుడిగా నామని శంకర్, కార్యదర్శిగా గుడిమల్ల బాపు, ఉపకార్యదర్శిగా ఆవిడపు శ్రీరాములు, కోశాధికారిగా ఇప్పలపల్లి సంతోష్, సలహాదారులుగా ఆవిడపు లక్ష్మణ్ ను ఎన్నుకున్నారు.

ఇరుకు గదిలో ఇబ్బందులు

- గ్రంథాలయంలో వసతులు లేక పాఠకుల అవస్థలు
- సొంత భవనం లేక గ్రామపంచాయతీ భవనంలో నిర్వహిస్తున్న వైనం
- పేరుకుపోయిన పాతపేపర్ల నిల్వలు
- పట్టించుకోని అధికారులు



ర్యాకుల్లో నిండిన పాత దిన పత్రికలు

దండేపల్లి: మండలంలోని గ్రంథాలయానికి పక్కా భవనం లేకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓ ఇరుకు గదిలో నిర్వహిస్తున్నారు. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. శాఖ గ్రంథాలయానికి నిత్యం 30 నుంచి 50మంది వరకు పాఠకులు వస్తుంటారు. వసతులు బాగుంటే, పాఠకుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అయినా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కుప్పలుగా దినపత్రికల నిల్వలు..

గ్రంథాలయానికి నిత్యం వివిధరకాల దినపత్రికలు వస్తుంటాయి. పాత దినపత్రికలను ఏడాదికోసారి అమ్మేస్తుంటారు. కానీ దండేపల్లి శాఖ గ్రంథాలయంలో 2018నుంచి ఇప్పటి వరకు అంటే సుమారు నాలుగేళ్ల దినపత్రికల నిల్వలు గుట్టలు గుట్టలుగా పేరుకుపోయాయి. వీటిని అమ్మేందుకు జిల్లా గ్రంథాలయ శాఖ అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ అమ్మేందుకు అనుమతులు ఇవ్వని కారణంగా వాటిని అమ్మకుండా అలానే నిల్వ చేసి పెడుతున్నారు. అసలే ఇరుకు, ఆ పై, పాత పత్రికల నిల్వలతో, గది మరింత ఇరుకుగా మారింది. పాత పనికిరాని దినపత్రికలు, పుస్తకాలను అమ్మేస్తే, గదిలో కొంత ఇబ్బందులు తొలగిపోయే అవకాశం ఉంది. అధికారులు పాత పత్రికలు అమ్మేందుకు అనుమతులు ఇస్తే బాగుంటుందని పలువురు పాఠకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త భవనం ఊసేలేదు..

శాఖ గ్రంథాలయానికి పక్కా భవనం నిర్మిస్తామని గతంలో గ్రంథాలయ సందర్శనకు విచ్చేసిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ ప్రవీణ్ అన్నారు. కానీ ఇంత వరకు కొత్త భవన నిర్మాణం ఊసే లేకుండా పోయింది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి, దండేపల్లి శాఖ గ్రథాలయానికి పక్కా భవనం నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు.

పుస్తకాలకు చెదలు

గ్రంథాలయ గది ఇరుకుగా ఉండటమే కాకుండా శిథిలావస్థలో ఉంది. దీంతో చిన్న పాటి వర్షం కురిసినా ఊరుస్తుంది. గత వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు గ్రంథాలయంలో నీళ్లు నిలిచి, పుస్తకాలు తడిసి పోవడంతో పాటు, కొన్నింటికి చెదలు పట్టి పాడైపోయాయి.



సంక్షిప్త వార్తలు

చలివేంద్రం ఏర్పాటు

నెన్నెల: మండల కేంద్రంలో కొండు లక్ష్మయ్య-దుర్గమ్మ, కొండు మల్లక్క జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రంలో చల్లటి మినిరల్ వాటర్‌తో పాటు వారానికి ఒకసారి మజ్జిగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొండు శంకర్, బాపు, బక్కయ్య, వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 15నుంచి క్రీడా పోటీలు

భీమారం: ముఖ్యమంత్రి కప్‌లో భాగంగా గ్రామాల్లో నైపుణ్యమైన క్రీడాకారులను వెలికి తీసేందుకు క్రీడలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 15నుంచి మండల స్థాయిలో జరిగే కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్, పోటీల్లో పురుషులతో పాటు మహిళా క్రీడాకారులు కూడా పాల్గొనవచ్చునన్నారు. గ్రామస్థాయిలో ప్రతిభ చూపిన వారిని మండల స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన గోళ్ల రాజమల్లు ఇటీవల దళిత రత్న అవార్డు అందుకున్నారు. దీంతో ఆయనను దండేపల్లిలో నేతకాని మహార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రమేష్, ఇసాక్, ప్రేంసాగర్, లక్ష్మణ్, చంద్రయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

భరోసా సభకు తరలిన బీఎస్పీ నాయకులు

చెన్నూర్: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో ఆదివారం బహుజన సమాజ్ పార్టీ తలపెట్టిన తెలంగాణ భరోసా సభకు చెన్నూర్ మండలానికి చెందిన బీఎస్పీ నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బీఎస్పీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నిట్టూరి సారయ్య, నాయకులు చెడంక మాంతయ్య, అత్కూరి రాజలింగయ్య, రాజు, నగేశ్‌లతో పాటు మరో 50మంది ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటకు చెందిన రడపాక సరిత వివాహానికి మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ రూ.5వేల ఆర్థిక సాయం ఆదివారం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సతీష్, నాయకులు కాంతరావు, రాజయ్య, సల్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె

జైపూర్: సెర్ప్ వీవోఏల సమ్మె ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కొనసాగింది. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు చేపట్టిన సమ్మె 21వ రోజుకు చేరింది.

'స్పష్టమైన హామీ ఇవ్వాలి'

కాసిపేట: ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాసేందుకే కేటీఆర్ పర్యటన అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ ఆదివారం విమర్శించారు. ఓరియంట్ కంపెనీలో నాలుగో ప్లాంట్ విస్తరణలో భాగంగా ప్రారంభానికి వస్తున్న ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పష్టమైన హామీ ఇస్తేనే మండలంలో పర్యటించాలని, లేకుంటే పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో యువతతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించారు.

ఆలయ దారిలో గుంతలు



దండేపల్లి: మండలంలోని గుడిరేవు గోదావరి ఒడ్డున గల శ్రీపద్మల్‌పురి కాకో ఆలయానికి వెళ్లే దారిలో గుంతలు పడ్డాయి. దీంతో ఆలయానికి వెళ్లే భక్తులు అవస్థలు పడుతున్నారు. వర్షం పడితే గుంతల్లో నీళ్లు నిలుస్తున్నాయి. కనీసం గ్రామ పంచాయతీ వారైనా స్పందించి గుంతల్లో మొరం పోయించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

బీఆర్ఎస్ హయాంలో పల్లెలు అభివృద్ధి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామాలు బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలోని కలమడుగు గ్రామంలో ఆదివారం గతంలో వరదల వల్ల దెబ్బతిన్న రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతు తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగాధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేశ్‌యాదవ్, మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జనార్దన్, నాయకులు బుచ్చన్న, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఇక్బాల్ అహ్మద్‌నగర్‌లోని గౌతమబుద్ధ విద్యానికేతన్ 2001–02లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రామసుధా రెసిడెన్సిలో ఆదివారం ఒకే వేదికపై చేరి సందడి చేశారు. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు ఆనాటి జ్ఞాపకాలను, మధురస్మృతులను పంచుకున్నారు. తమకు బోధించిన గురువులను సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం సాంబయ్య, చక్రపాణి, గోపాలకృష్ణ, కిరణ్, జావీద్, రఫీక్, కరీష్మా, కుసుమ, తమీషా, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని..

- హనుమాన్‌కు 101 కొబ్బరికాయలతో మొక్కు
- 10వ రోజుకు జేపీఎస్, ఓపీఎస్‌ల నిరవధిక దీక్ష



మంచిర్యాల ఐబీలో హనుమాన్ విగ్రహం వద్ద జేపీఎస్, ఓపీఎస్‌లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జేపీఎస్, ఓపీఎస్ వ్యవస్థను రద్దు చేస్తూ రెగ్యులర్ చేయాలని చేపట్టిన శాంతియుత నిరవధిక దీక్ష ఆదివారం 10వ రోజుకు చేరుకుంది. అమరులైన జేపీఎస్, ఓపీఎస్ మృతులకు సంతాపం తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి దీక్షలో కూర్చున్నారు. ఇక తమను రెగ్యులర్ చేసి ఆదుకోవాలని ఇందుకు ప్రభుత్వానికి కనువిప్పు కలగాలని కోరుకుంటూ మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని భారీ హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 101 టెంకాయలు కొట్టి ప్రభుత్వం త్వరగా తమను రెగ్యులర్ చేసి తమను, తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరుకున్నారు.

జేపీఎస్‌లకు అధికార పార్టీ నాయకుల మద్దతు

జన్నారం: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని చేపట్టిన సమ్మెలో ఆదివారం అధికార పార్టీ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో సర్పంచులతో పాటు గ్రామ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు మున్వర్ అలీఖాన్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జాడి గంగాధర్, పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, ఎంపీటీసీ రియాజోద్దీన్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేశ్‌యాదవ్, మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జనార్దన్, జిల్లా నాయకులు రజాక్, జేపీఎస్ ల యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎజాస్, నాయకులు వినోద్, మధు తదితరులు పాల్గొన్నారు.

'అవినీతి ఎమ్మెల్యేల చిట్టాను బహిర్గతం చేయాలి'



రిలే దీక్షలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చెన్నూర్: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల చిట్టాను ముఖ్యమంత్రి కేసీఆర్ బహిర్గతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ సుందిళ్ల మల్లేశ్ అన్నారు. దళితబంధు పథకంలో లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యేలు రూ.2నుంచి రూ.3లక్షలు వసూలు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక పాత తహసీల్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. స్వయంగా ముఖ్యమంత్రి దళితబంధు పథకంలో అవినీతి జరిగిందని ప్రకటించిన నేపథ్యంలో హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంత్రి మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఫారెస్ట్ క్వార్టర్



దండేపల్లి: ఫారెస్టు సిబ్బంది పనిచేసే చోటనే నివాసముండాలనే ఉద్దేశంతో గతంలో కొన్నిచోట్ల అటవీశాఖ క్వార్టర్స్‌ను నిర్మించింది. అందులో భాగంగా దండేపల్లి మండలంలోని కొన్ని చోట్ల నిర్మించిన ఫారెస్టు క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకోగా మరికొన్ని చోట్ల సిబ్బంది నివాసం ఉండకపోవడంతో నిరుపయోగంగా మారాయి. దండేపల్లి మండలంలోని మొకాశిగూడలో 1998 నిర్మించిన ఫారెస్టు క్వార్టర్‌లో సిబ్బంది ఉండకపోవడంతో నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తేవాలని పలువురు పేర్కొంటున్నారు.